క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న సైంటిస్ట్ డాక్టర్ వరప్రసాద్‌రావు

దర్శి: స్థానిక లయోలా కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం జరిగింది. పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులతో, ఉపాధ్యాయులతో కలిసి తమ అనుభవాలు పంచుకున్నారు. ఏ విధంగా కష్టపడ్డారు, ఏ విధంగా స్థిరపడ్డారు, ఎవరెవరు ఎక్కడెక్కడ ఉన్నారు? ప్రస్తుత విద్యార్థులకు వివరించారు. ఆంథోని పాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘ సేవకుడు జీవీరత్నం మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు వచ్చి నూతన విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపడం అభినందనీయమన్నారు. కేవీకే సైంటిస్ట్ డాక్టర్ సీహెచ్ వరప్రసాద్‌రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పూర్వ విద్యార్థులు కలిసి మాట్లాడుకుంటుంటే ఆనాటి మధుర జ్ఞాపకాలు నెమరు వేసుకుంటుంటే ఎంతో సంతృప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పక ధరించాలి

పుల్లలచెరువు: ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుకోవాలని ఎస్‌ఐ సంపత్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలో శనివారం ఆయన వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేసి ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పని సరిగా ప్రభుత్వం నిర్దేశించిన పత్రాలు కలిగి ఉండాలని చెప్పారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు దూరప్రాంతాలకు వెళ్లే సమయంలో తప్పని సరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. ప్రభుత్వం సూచించిన నియమాల ప్రకారం జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రజలు గమనించి ప్రభుత్వం సూచించిన నియమాలు పాటించాలన్నారు. ఏఎస్‌ఐతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

భక్తిశ్రద్ధలతో గోదాదేవి కళ్యాణం

● 108 గంగాళాలతో నైవేద్యం నివేదన

కురిచేడు: ధనుర్మాసం సందర్భంగా స్థానిక శ్రీ కోదండరామాలయంలో శనివారం గోదాదేవి కళ్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పూజారి శ్రావణ్‌కుమార్ మహిళలతో కళ్యాణ కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి 108 గంగాళాలతో నైవేద్యం చేయించి స్వామి వారికి నివేదించారు. కళ్యాణం కార్యక్రమాన్ని మహిళలు నియమనిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గుప్తా మహిళలకు పూజా కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు.



గోదాదేవి కళ్యాణం చేస్తున్న మహిళలు

16న మండల సర్వసభ్య సమావేశం

పుల్లలచెరువు: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వసంతరావు నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ వెంకటయ్య అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు. తగిన సమాచారంతో మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.

డెయిరీల్లో విస్తృత తనిఖీలు



డెయిరీలో తనిఖీ చేస్తున్న పోలీసులు

ముండ్లమూరు (దర్శి): పాల డెయిరీల్లో విస్తృత తనిఖీలు నిర్వహించి అనుమానిత ఆయిల్‌ను సీఐ రామారావు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో పాల కేంద్రాలు, డెయిరీల్లో శనివారం తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో 9 పామాయిల్ క్యాన్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఆ ఆయిల్ అనుమానాస్పదంగా ఉందని, ఆయిల్‌ను ల్యాబ్‌కు పంపి రిపోర్టులు వచ్చిన తర్వాత చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎస్‌ఐ నాగరాజు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాలెండర్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆమె నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శులు బీవీ రెడ్డి, నాగమల్లేశ్వర్ రెడ్డి, జక్కుల రామకృష్ణ పార్టీ సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, కటకంశెట్టి శ్రీనివాసరావు, గుడా గోపాల్ రెడ్డి, ఆదం షరీఫ్, పూనూరు దేవదానం, షేక్ మస్తాన్ వలి పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

అనాథ వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

దర్శి: చలివేంద్రంలోని కాశీనాయన ఆశ్రమంలో అనాథ వృద్ధులకు మానవత సంస్థ ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. మల్లారెడ్డి హాస్పటల్ అధినేత డాక్టర్ మల్లారెడ్డి సుమారు రూ.15 వేల విలువైన 70 దుప్పట్లను సంస్థ ద్వారా పేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ వృద్ధులకు చలికాలం దృష్టిలో పెట్టుకుని దుప్పట్లు అందించిన మల్లారెడ్డిని అభినందించారు. డాక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ ద్వారా నిజమైన పేదలకు మానవత చేస్తున్న సహాయ సహకారాలు మరువలేనివన్నారు. సంస్థ ద్వారా సహాయం చేయడం ఎంతో సంతృప్తిగా ఉందన్నారు. మానవత కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, సంస్థ డైరెక్టర్లు రాజశేఖరరెడ్డి, చింత తిరుపతిరెడ్డి, జైహింద్‌రెడ్డి, దారం వాసుదేవరెడ్డి, జె.సుశీల, ఆశ్రమ నిర్వాహకులు దారం వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీరెడ్డి, గోగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మల్లారెడ్డి